

దశాబ్దాలో....

ఎవరికి తెలుసు ?

పొద్దున్నే లేవటం, కాలకృత్యాలు తీర్చు-కోవటం, కాసేపు పూజ చేసుకోవటం, కాస్త ఉడకేసుకోవటం, పేపరు చదవటం, కాసే-పు లైబ్రరీలో కూర్చోవటం, ఫోం చెయ్యటం, నిద్ర పోవటం, లేవటం, మిగిలిన వ సలా-ళ్లతో కలిసి కాలవగట్టుకి వెళ్లటం, వాళ్లతో పిచ్చాపాటీ మాట్లాడటం, రాత్రికి మళ్లీ ఉడకేసుకోవటం, తినడం, పడు కోవటం... ఇదే నా దినచర్య - ఇదే నా దినచర్య...

కుర్వన్నేవేహ కర్మాణి
జిజీవిషేచ్ఛతగ్ం సమాః
ఏవంత్వయి నాన్యథేతో
స్తినకర్మవిప్యతేనరే!

**ఈ శ్లోకం మళ్లీ చదివాను. దాని అర్థం కూడాచదివా-ను. నా బుర్రకి ఎక్కలే-దు.**

మళ్లీ మళ్లీ చదివాను.

మానవుడు కర్మలను చేయుచునే వంద సంవత్సరములు జీవించాలని కోరుకోవలెను. అట్టి కర్మ అతనిని కర్మ శాసనమునకు బంధిం-పదు. మానవునికి ఇంతకంటే వేరే మార్గ-ము లేదు.

శ్రీ ఈశోపనిషత్ చెప్తోంది.

నాకు ఏమాత్రం అర్థం కాలేదు. ఇది నా అవగాహన లోపమా? లేక ఉపనిషత్తులు ఈ కాలానికి వర్తించవా?

పుస్తకం మూసేసి కుర్చీలో వెనక్కి వాలాను.

* * *

ఏం చెయ్యాలి ?
ఎలా చెయ్యాలి ?
అసలేముంది చెయ్యడానికి ?
ఎన్నాళ్లిలా ?
ఏమో ?
ఎన్ని నెలలో, ఎన్ని సంవత్సరాలో, ఎన్ని

మిగిలిన సమయంలో పడక్కుర్చీలో ఓ మూటలా కూర్చోవటం, గతించిపోయిన గతం గురించి, ఆశలేని భవిష్యత్తు గురించి ఆలో-చించడం -

ఆలోచించడం -

ఆలోచించడం -

నాకీ ఆలోచన మీద విసుగెత్తిపోయింది.

ఈ ఆలోచనల్ని ఎవరైనా ఆపగలరా ?

భగవద్గీత చదివినా, ఈశోపనిషత్ చదివినా, విష్ణుపురాణం చదివినా -

ఎక్కడా నా ఆలోచనలకి పొంతన కుదరడం లేదు. బతకల్ని కాడదు - నాలాంటి వాళ్లు బతకల్ని కాడదు.

ఇలాంటి దుర్భర వేదనతో, ఇంత దారుణమైన ఒంటరితనంతో ఏ మనిషీ బతకల్ని కాడదు.

కాని బతకక చేసేదేమిటి ?

ఆత్మహత్య...

అది పాపంట, అది పిరికితనంట, అది దుందుడుకుతనంట. కాని ఎలా ?

ఇంత దుర్భర ఒంటరితనం గడుపుతూ బతకటం ఎలా ?

జీవితంలో నేనెప్పుడూ ఇంతలా బాధపడ్లేదు.

చిన్నతనం బాగానే గడిచింది.

ఇదే ఊళ్లో-

కాలువలో ఈదులాడుతూ, పులుపు మామిడి కాయలు కోసుకు తింటూ, కలువపూలు కోసం చెరువులో ఈతలాడుతూ, గుమ్మడి పూల మధ్య పరుగెడుతూ, పంట చేలగట్ల మీద నడుస్తూ - ఆవుదూడల్ని తరుముతూ, తల్లి ఆప్యాయతను, తండ్రి ఆదరణను చవిచూస్తూ హాయిగానే గడిచిపోయింది.

హైస్కూలు చదువు పూర్తికాగానే మా నాన్న పిలిచి "ఒరేయ్- పమ్మి, కాలేజీ చదువుకి వెడతానంటున్నావట. మంచిదే. పై చదువులు చదువుకుని జీవితంలో పైకి వస్తే మంచిదే- నేనూ సంతోషిస్తాను. కాని ఒరేయ్ కన్నా - నాకు నువ్వు ఒక్కగానొక్క కొడుకువి. నువ్వు చదువుకని , ఉద్యోగానికని దూరం వెళ్లపోతే - నేను, అమ్మ ఎలా బతకాలి? నిన్ను విడిచి, నీకు దూరంగా ఎలా బతకాలి ? కొంచెం ఆలోచించు.' మనకా లోటు లేదు. ఉన్న కొంద్ర పండించుకున్నా మనకి హాయిగా గడిచిపోతుంది. ఆలోచించు- కన్నా - ఆలోచించి నీకేది మంచిదని తోస్తే అదే చెయ్యి" అన్నాడు.

ఆ ఊళ్లోనే ఉండిపోయి - తల్లిదండ్రుల మంచిచెడ్డలు చూస్తూ ఉండిపోవాలని నిర్ణయించుకున్నాను. తర్వాత కొన్నేళ్లకి పంచాయితీ ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం వచ్చింది. ఓ పక్కన వ్యవసాయం చేసుకుంటూ, మరోపక్క ఉద్యోగం చూసుకుంటూ -

పెళ్లైంది. యోగ్యురాలైన భార్య వచ్చిందని అంతా సంతోషించారు. మా అమ్మని, నాన్నని కంటికి రెప్పలా చూసుకొనేది. వృద్ధాప్యంలో అమ్మ, నాన్న భగవన్నామ స్మరణతోను, పురాణ కాలక్షేపం తోను హాయిగా గడిపే వారు.నాకు పిల్లలు కలిగారు. తాత, నాయనమ్మల ప్రేమతోను, గుమ్మపాలతోను, సున్ని ఉండలతోను, పెరుగు మీగడలతోను, స్వచ్ఛమైన గాలి పీలుస్తూ పెరిగారు.

వాళ్లు నాలా హైస్కూలు చదువుతో ఆపెయ్యకూడదని అనుకున్నాను. వాళ్లకీ పై చదువుల మీద ఆసక్తి వుంది. పెద్దాడు ఎం. ఎస్. సి. - పి. హెచ్. డి. చేసి ఢిల్లీలో కొన్నాళ్లు ఉద్యోగం చేశాడు. రెండోవాడు ఇంజనీరింగ్ చదివి బొంబాయిలో స్థిరపడ్డాడు.

వాళ్ళకీ పెళ్ళిళ్ళయ్యాయి-వాళ్ళకీ పిల్లలు కలిగారు. పెద్దాడికి అమెరికాలో ఉద్యోగం వచ్చింది. వెడతానన్నాడు. వద్దని నేనలేదు. రెండోవాడు బొంబాయిలో ఇల్లు కట్టుకుని స్థిరపడ్డాడు. దానికీ నేను బాధపడలేదు.

నాపిల్లలు కూడా నాలాగే స్థిర ధ్రువ, వరధ్రువ అయిపోవాలని నేనెప్పుడూ అనుకోలేదు.

కాని-ఒకటి మాత్రం అనుకున్నాను.

ఈ కాంతం శాశ్వతం అనుకున్నాను...-కాంతం నా భార్య-నా తోడు, నీడ. .నాతో కలిసి ఏడడుగులు వేసిననాటినుంచి ఆమె ఆగలేదు. నాతో కలిసి అడుగులు వేస్తూనే-ఉంది...

నిజం చెప్పొద్దూ-పిల్లలిద్దరూ అలా దూరప్రాంతాల్లో ఉండడందానికిష్టంలేదు. అలాగని మేం వెళ్ళి అక్కడ ఉండనూలేం! నేనే దానికి నచ్చజెప్పాను. 'కాలం మారుతోంది. కాలానుగుణ్యంగా మనుషులు మారాలి' అని నేనే నచ్చజెప్పాను. అదే సర్దుకుని,, మనసుకి సమాధానం చెప్పకుంది. దానికన్నాముందు నేనే పోతాననుకున్నాను. కాని తనే ముందు-

అదుగో అప్పట్నుంచి నన్నీ భయంకరమైన ఒంటరితనం పీడిస్తోంది.

వాడు "అమెరికా వచ్చెయ్" అంటాడు.

వీడు "బొంబాయి వచ్చెయ్" అంటాడు. అంతకీ వెళ్ళాను-అక్కడికీ వెళ్ళాను- ఇక్కడికీ వెళ్ళాను ఎక్కడా ఉండలేకపోయాను.

ఈ గాలీ, ఈ నేల, ఈ నీరు-ఈ స్వచ్ఛత ఏది? ఏదో కూపంలో బంధింపబడినట్టుగా- ఊపిరాడనట్టుగా-

అందుకే మా ఊరికి తిరిగివచ్చాను....

కొడుకులు, కోడళ్ళతో ఉంటూ, మనవలతో ఆడుకుంటూ-వాళ్ళకి కథలు, కబుర్లు చెప్తూ-

నో-ఆ అదృష్టం అందరికీ రాదు.

అది అదృష్టమా?

ఏమో-మనసునిబట్టే ఉంటుందనుకుంటూ-


రామ్మూర్తి-

అతనూ నాలాగే వృద్ధుడు.

కొడుకు మాఊరి హైస్కూల్లో టీచరు. కొడుకుదగ్గరే ఉంటున్నాడు భార్యతో సహా-

రోజూ సాయంత్రం కాలువగట్టుకి వెళ్ళినపుడు వాళ్ళగురించి ఏవో ఒకటి, చెప్తూనే ఉంటాడు. కొడుకు తను చెప్పినమాట వినడంలేదంటాడు. కోడలికి తనమీద గౌరవం లేదంటాడు. మనవలకి తనమీద గౌరవం లేదంటాడు. అతను చెప్పే కారణాలన్నీ హాస్యాస్పదంగా ఉంటాయి.

"కాలం మారింది. మనమూ మారాలి.



వాళ్ళ ఆలోచనలేమిటో అర్థం చేసుకుని మనం మసలు కోవాలి" అని చాలాసార్లు చెప్పాను.

అతనికి నామాటలు రుచించవు.

నేనెప్పుడూ అనుకోలేదుగాని-కాంతం బతికున్నపుడు అంటూండేది. "పిల్లల్ని అనవసరంగా పెద్ద చదువులు చదివించారు. మన చేతికి అందకుండా వెళ్ళిపోయారు." ఆమె అలా అన్నపుడల్లా నేను నవ్వి ఊరుకునేవాణ్ని. తలిదండ్రులంతా పిల్లలు తమని ఒదిలి వెళ్ళిపోకూడదని, ఎప్పటికీ తమతో పాటే తమ ఊళ్లోనే ఉండాలని అనుకుంటే ప్రపంచం ఇంత అభివృద్ధి చెందేదా? అనిపిస్తుంది.

రోజూ ఇవే ఆలోచనలు-

బంధాలు చిత్రంగా ఉంటాయి.

ఒక మనిషి మహా అయితే డెబ్బైఏళ్ళు బతుకుతాడు. డెబ్బైఏళ్ళలో సగం నిద్రకే సరిపోతుంది. మిగిలిన దాంట్లో కొంతకాలం ఏవీ తెలియని బాల్యం, మరికొంతకాలం బాధ్యత తెలియని యవ్వనం-

మిగిలిన కాస్త కాలంలో-ఏవో బంధాలు, అనుబంధాలు, ప్రేమలు, ద్వేషాలు, కోపాలు, శతృత్వాలు, మిత్రత్వాలు.

పడకకుర్చీలో కూర్చుని ఆలోచిస్తుంటే పోస్టుమాన్ వచ్చి ఉత్తరాలు ఇచ్చివెళ్ళాడు.

ఒకటి పెద్దాడు రాశాడు-అమెరికానుంచి. వాడి కొడుకు క్లాసు ఫస్ట్ వచ్చాట్ట. ఆ సంతోషవార్త చెప్పడానికి రాశాడు. ఒక్కసారి నామనసు అమెరికా వెళ్ళిపోయింది. పెద్దాడికి అమెరికాలోఉన్న స్థిర చరాస్తులన్నీ అమ్మేస్తే పదిలక్షలరూపాయలదాకా వస్తుంది. అంత సంపాయించాడుకదా- వెనక్కి వచ్చెయొచ్చుగా- అని ఓ క్షణం అనిపించింది.

మళ్ళీ నాకే నవ్వొచ్చింది.

బొంబాయిలోవున్న చిన్నాడు నెలకో ఉత్తరం రాస్తూనే ఉన్నాడు-తన దగ్గరకి వచ్చెయ్యమని...వెళ్ళానా?

ఇండియాలోఉన్న కొడుకు దగ్గరకి వెళ్ళకుండా అమెరికాలో ఉన్న కొడుకు ఇండియా రావాలని కోరుకుంటున్నాను

ఏమిటో-మనసు చిత్రమైంది...

"వాళ్ళకి రెక్కలొచ్చాక వాళ్ళు మనని పట్టించుకోరండీ?" అంటాడు రామ్మూర్తి

నిజవా? ఏమో

అతనివరకు నిజమేమో-

ఏది నిజమో-ఎవరు చెప్తారు?

అదిగో మళ్ళీ- ఆలోచనల గుహల్లోకి వెళ్ళిపోతున్నాను.

"హల్లో మిస్టర్ పార్వతీశం- హౌ ఆర్-యూ?" పిలుపు విని గుమ్మంలోకి చూశాను.

ఆదిత్య...

అతనలా పిలుస్తుంటే ఒకోసారి నాకు కోపం వస్తుంది. నాకతని పెదనాన్న వయసుంటుంది. నన్ను మిస్టర్ పార్వతీశం అంటాడు-

అతని తప్పూలేదు.

ఇంగ్లీషులో వయసు భేదం లేకుండా అలానే పిలుస్తారు. అతను బాగా చదువుకున్నవాడు- ఇంజనీరింగ్ చదివి, మా ఊళ్లో ఏదో ఫ్యాక్టరీ పెట్టాడు. మా ఇంట్లోనే ఓ వాటాలో అద్దెకుంటున్నాడు. ఇల్లు కట్టుకునేదాకా మా ఇంట్లోనే ఉంటానన్నాడు. అతని భార్య విలాసిని- బంగారు బొమ్మలా ఉంటుంది. గుణమూ బంగారమే-

వీళ్ళిద్దరూ పట్నాల్లో పెరిగి నగరాల్లో చదువుకుని పల్లెటూళ్లో స్థిరపడటానికి వచ్చారు.

చిత్రం! ఆ అమ్మాయికి తొమ్మిదో నెల గర్భిణీ...కొద్దిరోజుల్లో పురిటికి పుట్టింటికి వెడుతుంది.

"తాతగారూ! అన్నం తిన్నారా?" అని రెండుపూటలా అడుగుతుంది. అప్పుడప్పుడు పండో ఫలమో ఇస్తూ ఉంటుంది.

ఓసారి ఏదో మాటల్లో "నేను చటుక్కున గుటుక్కుమంటే మా పిల్లలకి తెలిపే బాధ్యత మీదే" అంటే చాలా నొచ్చుకుంది.

"మేముండగా మిమ్మల్ని గుటుక్కుమననిస్తామా?" అంది.

ఓ అర్ధరాత్రి నిద్రోపోతుంటే తలుపు కొట్టిన చప్పుడైంది.

"ఎవరూ" అనడిగితే

"నేను-ఆదిత్య"

తీరా తలుపు తీస్తే అతను వణికిపోతున్నాడు. ఏం జరిగిందని నేను అడక్కుండానే "విలాసినికి నొప్పులొస్తున్నాయి. నాకు చాలా భయంగా వుంది." అన్నాడు.

"భయం ఎందుకూ? నే వెళ్ళి డాక్టర్ని పిలుచుకొస్తాను." అన్నాను చొక్కా తొడుక్కుంటూ.

"వెళ్ళొచ్చాను. డాక్టర్ ఊరెళ్ళాట్ట." అన్నాడు.

మా ఊళ్ళో ఉన్న మంచి డాక్టర్ ఒక్కడే- అతను కాస్తా ఊళ్ళోలేడు- ఏమిటి

భలే బాలలు



## చదువులో ఘటికులైన దీనా-సునయన

'77 ఫిబ్రవరి 13వ తేదీన పదినిముషాల తేడాతో హైదరాబాద్‌లో జన్మించిన వీరి పేర్లు దీనా-సునయన కాలకంటి విశ్వనాథ్- స్వర్ణవేణి వీరి తల్లిదండ్రులు చిన్నప్పుడు వీరిద్దరూ ఎర్రగా బొమ్మగా వుండేవారు ఇద్దరిలోకి దీనా పెద్దది

విచిత్రం ఏమంటే వీరిద్దరి స్వభావాలు విరుద్ధంగా వుంటాయి పెద్దమ్మాయి నెమ్మది పిల్లకాగా, చిన్నమ్మాయి మహాగడుసరి కాని చదువులో యిద్దరూ ఘటికులే. వీరిప్పుడు హైదరాబాద్‌లోని సాయి పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నారు

– యం రాజశ్రీ గాయత్రి, హైదరాబాద్

మార్గం.

అప్పటికే వర్షం పడుతోంది.

మా ఊరికి నాల్గుమైళ్ళదూరంలో మరో ఊళ్లో మరో డాక్టర్ ఉన్నాడు. అతన్ని పిల్చుకువస్తే?

కాని ఎవరెడతారు? ఎవరు పిల్చుకొస్తారు.

"మీరేసాయం చెయ్యాలి. విలాసిని నొప్పులు భరించలేకపోతున్నది." ఆదిత్య కంగారు పడిపోతున్నాడు.

ఆకాశం నిండా మేఘాలు. కన్ను కనపడని చీకటి. వర్షం పెద్దదైంది.

నాలో ఏదో తెగింపు వచ్చింది.

పంచె పైకి ఎగ్గట్టి, తువ్వాలు చెవులమీదుగా తలకి చుట్టి ఆదిత్య సైకిల్ తీసుకుని మెట్లు దిగుతుంటే

"ఏం చేస్తారు?" అనడిగాడు.

"ఇక్కడికి నాల్గుమైళ్ళ దూరంలో డాక్టరున్నాడు. తీసుకొస్తాను" అన్నాను.

"మీరా?"

"ఆ నేనే- ఏం ఫర్వాలేదు. నువ్వు నీ పెళ్ళానికి ధైర్యం చెప్తూ ఉండు."

తీరా రోడ్ మీద కొచ్చి సైకిలెక్కాక కన్ను పొడుచుకున్నా దారి కనబడ్డంలేదు. రోడ్డంతా గోతులు. నీళ్ళునిండి ఉన్న కారణంగా సైకిల్ గోతిలోకి వెడుతున్నట్టు కూడా తెలియడం లేదు. ఓ చోట సైకిల్ గోతిలో పడి ఆ కుదుపుకి సైకిల్ మీంచి కిందపడ్డాను. లేచి మళ్ళీ సైకిలెక్కాను. తడిసి ముద్దైపోయాను.

అలాగే పడుతూ, లేస్తూ పడుతూ లేస్తూ ఆ ఊరు చేరుకున్నాను. అదృష్టవశాత్తు డాక్టర్ ఇంట్లోనే ఉన్నాడు. నేను చెప్పినదంతావిని స్కూటర్ బైటికి తీశాడు.

* * * *

"కేర్"మన్న ఏడుపు విని చటుక్కున లేచి నిలబడ్డాను. "మగపిల్లాడు" మంత్రసాని చెప్పింది.

"ఆదిత్యా- కంగ్రాట్యులేషన్స్."


"మీరు సమయానికి ఆదుకోకపోతే...." అతని కళ్ళలో నీళ్ళు.

పిల్లాడు పుట్టాడు. వాడు పెరిగి పెద్దవాడౌతాడు. "తాతయ్యా" అంటూ నా దగ్గరికి వస్తాడు. నా ఒళ్ళో కూర్చుని ఆటలాడుకుంటాడు. నా గుండెల మీద పడుకుంటాడు.

ఆలోచనలు, ఆలోచనలు, ఆలోచనలు....ఆపడం ఇష్టంలేని ఆలోచనలు.

"మానవుడు కర్మలను చేయుచునే వంద సంవత్సరములు జీవించాలని కోరుకోవలెను"

ఇదా ఈశోపనిషత్ సారం!




## ఆదిశంకరులమాతృభక్తి!

ఆది కాలం నుంచీ మానవులలో ఆస్తికులతోపాటు నాస్తికులూ ఉంటున్నారు. కలియుగంలో దైవ భక్తి అంతరించిపోతున్నదని, దేవుడు లేడనేవాళ్ళే ఎక్కువగా ఉన్నారనీ అనుకోనక్కరలేదు. ఇప్పుడు దేవాలయాల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. పట్టణాల్లో పేటకు, కాలనీకి ఒక దేవాలయం నిర్మింపబడుతూనే వున్నది. మ్రొక్కుబడులు చెల్లింపబడుతూనే వున్నవి. భక్తుల సంఖ్య పెరుగుతూనే వున్నది. అనేక ఉత్సవాలు జరుగుచునే ఉన్నవి. శ్రీమంతులు పేరు ప్రతిష్ఠల కోసం ఎంతో ధనం ఖర్చు పెడుతూనే వున్నారు.

అయితే ఇంట్లో వున్న వృద్ధులైన తల్లిదండ్రులను గమనించకుండా, చాలా హీనంగా చూస్తూ, దేవాలయాలకు పోయి మహా వైభవంగా పూజలు జరిపించేవారు ఎందరో ఉన్నారు దేవాలయాల్లోని దేవుళ్ల కంటే తల్లిదండ్రులే ముఖ్యులనే, వారు దైవసమానులని భావించడం ధర్మం. "మాతృదేవోభవ, పితృదేవోభవ, నమతః పరదైవతం" అనే వేద వాక్కును, పెద్దల మాటలు ఎరగనివారు లేరు. భగవదవతారమూర్తియగు ఆది శంకరులు తమ ప్రశ్నోత్తరమాలికలో మాతృదేవతయే ఇతర దేవతలకంటే ఉత్తమమైన దేవత అని వివరించి యున్నారు.

తాను సన్యసించినా, తల్లి అవసానసమయంలో తలుచుకొన్న మాత్రాన వత్తునని వాగ్దానం చేసి, ఆ విధంగానే వచ్చి ఆమెకు తృప్తికలిగించారు. సన్యాసికి సంసారసంబంధం లేనందున, ఆయన జననికి అంత్యక్రియలు జరుపకూడదని ఇతరులు తన్ను విమర్శించినా లెక్క చేయక ఆమెకు అంత్యక్రియలు జరిపారు. తల్లి దైవసమానురాలైనందున తాను చేసిన ఆ అంత్యక్రియ దేవతా పూజ అనే ఆయన భావించెను. మాతృదేవతను నిందిస్తూ ఎందరు దేవతలను పూజించినా ఆ పూజ బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

-బులుసు వేంకటరమణయ్య